క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి పూజలు



పామర్రు:మండలంలోని రాపర్ల గ్రామంలో నెలకొన్న గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆవు పాలు ఆవు పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో స్వామికి అభిషేకాలు చేశారు. నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో స్నపనలు నిర్వహించారు. తదుపరి స్వామి వారిని ప్రత్యేకంగా పుష్పమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం శత సహస్ర నామాలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాకర్ల అర్జునరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర్ల మాధవి, కాకర్ల రాధిక, ఓంకార్ ట్రస్టు మేనేజర్ కాకర్ల విజయ మాధురి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. ఆలయంలో పూజాదికాలను అర్చకులు బృందావనం పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



ముదినేపల్లి రూరల్ : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు దూలం ఆది వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడాలికి చెందిన బొల్లా మస్తానరావు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో ఎంపీపీ, ఆది వినయ్‌కుమార్‌లు పార్టీ మండలశాఖ తరపున గురువారం రూ.45 వేలు, నిత్యవసర సరుకులు అందజేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, సాక్షి సాయిబాబు, బత్తిన కిషోర్, మల్రివాడ సుధాకరరెడ్డి, మరీదు హనుమంతు, పేర్ని పృధ్వీ పాల్గొన్నారు.

దేవపూడి ఉప సర్పంచ్‌గా వేణు



ముదినేపల్లి రూరల్ : మండలంలోని దేవపూడి పంచాయతీ ఉపసర్పంచ్ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి బి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. పంచాయతీ 8వ వార్డు సభ్యుడు బోయిన వేణుగోపాలస్వామి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వేణుగోపాలస్వామికి రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

యూనియన్ బ్యాంక్ జీఎం వికాష్‌కుమార్



మచిలీపట్నంటౌన్: పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందే అభ్యర్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వికాష్ కుమార్ అన్నారు. స్థానిక పట్టాభి సంస్థను జీఎంతో పాటు డెప్యూటీ జనరల్ మేనేజర్ మురళీ పార్థసారథి, మచిలీపట్నం రీజనల్ హెడ్ వెంకట్రావు గురువారం సందర్శించారు. డీటీపీ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో వారు మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు స్వయంగా యూనిట్లను స్థాపిస్తే యూనియన్ బ్యాంక్ ద్వారా రుణం అందించి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ విజయభారతి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని అగినపర్రు శివారు బొడ్డువానిగూడెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, సర్పంచ్ కోట మణిరాజు, ఎంపీటీసీ జుఝువరపు శృతి, పీఏసీఎస్ అధ్యక్షులు అక్కినేని సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, మామిళ్లపల్లి సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, వీరంకి వెంకటేశ్వరరావు, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మండలంలోని అమీనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టలు వైభవంగా జరిగాయి. దుర్గా, మల్లేశ్వరస్వామి, వినాయకుడు, ఇతర పరివార దేవతల విగ్రహ ప్రతిష్టలు, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టలు చేశారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీపీ కాసాని వేద సుప్రజ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కోసూరు(మొవ్వ):మొవ్వ మండలం కోసూరు గ్రామంలోని హనుమాన్ సీతా లక్ష్మణ పరివార సహిత కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ రామాలయం (క్షత్రియ రామాలయం) ప్రాంగణం రంగులతో, విద్యుద్దీప కాంతులతో వేడుకకు ముస్తాబైంది. సీతా రామ్ గురుదేవుల అనుగ్రహంతో వైఖానస ఆగమ శాస్త్ర రీతిలో విష్వక్సేన పూజ, విశేష హోమాలు, యంత్రస్థాపనలు అనంతరం ఉదయం 7.56 నిమిషాలకు స్వామి వార్ల ప్రతిష్టలు, పంచ వింశతి కుంభాభిషేకాలు, కళావహన, శ్రీ స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరగనున్నట్లు రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిందా వెంకటేశ్వర్లు రాజు, గ్రామ మాజీ సర్పంచ్ చిందా వీర వెంకటనాగేశ్వర రాజు, బోరుకాటి ప్రసాదరాజు, చిందా వీర వెంకట కుటుంబరాజు తెలియచేశారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతల స్వీకారం

పామర్రు:మండల పరిధి కురుమద్దాలి గ్రామ కార్యదర్శిగా జీఎస్ఎస్ అంజనాదేవి విధుల్లో చేరినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ గురువారం తెలిపారు. మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అంజనా దేవి బదిలీపై వచ్చారని పేర్కొన్నారు. కంకిపాడు మండలం కుందేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బిఎల్ఎస్ కృష్ణ బదిలీపై రాపర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారని చెప్పారు.

శ్రీరామ్మూర్తి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం

పమిడిముక్కల: కృష్ణాపురం శివారు ముసలనాయకపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి శ్రీరామ్మూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మండల వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరామ్మూర్తి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యలమంచలి గణేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, మినుకూరి శ్రీనివాస్, మొవ్వ ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ అలీ, పార్టీ నాయకులు గొర్నెపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

పామర్రు:అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం అవుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దృష్ట్యా ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు విధమైన జాగ్రత్తలు వహించాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లను వారానికి ఒకసారి తప్పని సరిగా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించి సురక్షిత తాగునీరు అందించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, కో ఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీడీవో వై.రామకృష్ణ, సూపరింటెండెంట్ ప్రమీల, పలు గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వెంకటరమణ



మండవల్లి: మండవల్లి ఎంపీడీఓగా టీకే వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మైలవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు ఈఓపీఆర్డీగా కొనసాగుతారని అధికారులు పేర్కొన్నారు. తహసీల్దార్‌గా కె.రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నందిగామ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన పి.సతీష్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను ఆర్ఐ పద్మరోజ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



తహసీల్దార్ వెంకటశివయ్యకు వీడ్కోలు పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

తోట్లవల్లూరు:క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. తోట్లవల్లూరు తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై వెళుతున్న కట్టా వెంకటశివయ్యకు కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెంకటశివయ్యను కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, తహసీల్దార్ కుసుమకుమారి, డీటీ ధనలక్ష్మి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మండల సర్వేయర్ సురేష్‌బాబు, వీఆర్‌ఓలు రవిరెడ్డి, నాగేశ్వరరావు, శివశంకర్, బసవారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం కూచిపూడి నాట్యం



నృత్యం చేస్తున్న పూర్ణతేజస్వి

జమీగొల్వేపల్లి(పామర్రు): కూచిపూడి నాట్యం దేశానికే ఆదర్శమని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి అన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లి లోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా గురువారం కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉషాదేవి మాట్లాడుతూ కళలు మన సామాజిక ఔన్నత్యానికి పునాదులు అని తెలిపారు. మన సంస్కృతిలో భాగమైన కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. పూర్ణతేజస్వీ కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. రమ్యశ్రీ, వినీల, యశోద, భవనశ్రీలు దేశ భక్తి గేయాలు, వివిధ పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం కూచిపూడి నృత్యకారిణి పూర్ణతేజస్విని సత్కరించారు. గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కుసుమకుమారి బాధ్యతల స్వీకారం



తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు:తహసీల్దార్‌గా ఎం. కుసుమకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కట్టా వెంకట శివయ్య పెనమలూరుకు బదిలీ అయ్యారు. మచిలీపట్నం కలెక్టరేట్ నుంచి కుసుమకుమారి బదిలీపై తోట్లవల్లూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. డీటీ ధనలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో హోమాలు



రాపర్ల(పామర్రు):గ్రామంలో వేంచేసియున్న గణ్యశ్రీ వెంకటేశ్వర భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా త్రైమాసిన దీక్షలు గురువారం నిర్వహించారు. కార్యక్రమాలను యాజ్ఞిక స్వామి శ్రీమాన్ అగ్నిహోత్రం వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కార్ల అర్జునరావు తెలిపారు. ఆలయంలో పూజలను అర్చకులు బి.చక్ర పద్మనరసింహం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఓం కార్ ట్రస్టు మేనేజ్‌మెంట్ కాకర్ల విజయ మాధవి తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరసిద్ధి వినాయకస్వామి, భ్రమరాంబ, సుబ్రహ్మణేశ్వరస్వామి, నాగదేవత, నవగ్రహ దేవతల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పోల్‌రాజ్ కెనాల్ గట్లకు మరమ్మతులు



పోల్‌రాజ్ కాలువగట్టుపై ముళ్లపొదలు తొలగిస్తున్న పొక్లెయిన్

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రధానమైన పోల్‌రాజ్ కాలువ గట్టు గండ్ల పూడ్చివేత, ముళ్ల పొదల తొలగింపు కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. పశువులు కాలువలోకి అధిక సంఖ్యలో దిగడం కారణంగా నీటి ఒరవడికి కాలువ గట్లు కోతకు గురయ్యాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర అక్కడక్కడా కాలువగట్లపై గండ్లు ఏర్పడి మట్టి జారి కాలువలోకి పడిపోతోంది. గట్లపై దట్టంగా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో గట్లు పటిష్టం చేసేందుకు, ముళ్లకంపలు తొలగించేందుకు రూ.7 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్లు ముదినేపల్లి సెక్షన్ నీటి పారుదలశాఖ ఏఈఈ ఈకేవీ కిషోర్ తెలిపారు. ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ కింద గురజ నుంచి ముదినేపల్లి వంతెన వరకు 3 కిలోమీటర్లు, మండవల్లి మండలంలో మరో 3 కిలోమీటర్లు మేర కాలువగట్లు గండ్లు పూడ్చివేత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

వార్త పత్రికలతో విజ్ఞానం పెంపు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో వార్తా పత్రికలు చదువుతున్న విద్యార్థులు



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి పర్వీన

ముదినేపల్లి రూరల్ : ప్రతినిత్యం వార్తా పత్రికల పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని శాఖా గ్రంథాలయ అధికారి ఎం.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో వార్తా పత్రికలు చదివించి వాటి ప్రాధాన్యతను వివరించారు. విద్య, ఉద్యోగాలకు సంబంధించి పత్రికల్లో ప్రతినిత్యం అందించే సమాచారాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మండవల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పిల్లలకు క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి షేక్ పర్వీన తెలిపారు. విజేతలకు జూన్ 11న బహుమతులు అందజేస్తామన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు అందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో సుఖజీవనం



పేరూరు ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే డీఎన్నార్



కనకదుర్గా విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కైకలూరు/ముదినేపల్లి రూరల్: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో సుఖజీవనం గడపాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ అన్నారు. గురువారం ముదినేపల్లి మండలం పేరూరులో బాలచాముండిక సమేత అమరలింగేశ్వరస్వామి ధ్వజస్తంభ, శిఖరవిగ్రహ ప్రతిష్ఠ, కలిదిండి మండలం భోగేశ్వరలంకలో కనకదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, బొర్రా శేషుబాబు, సాక్షి సాయిబాబు, నీలపాల వెంకటేశ్వరరావు, చిట్టూరి బుజ్జి, కందుల వెంకటేశ్వరరావు, చాంద్ బాషా, కొండేటి రాజా, షేక్ దాదా, లక్ష్మీ, బాలాజీ, ఫణికుమార్, భాస్కరరావు, బాబూరావు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వివేక్ అన్నారు. గురువారం మండలంలోని నరసింహపురం గ్రామంలో 104 సంచార వాహనం ద్వారా వైద్యసేవలందించారు. షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్యసేవలను ఇంటి వద్దే అందించడంతో పాటు ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్నామని వివేక్ తెలిపారు. అనంతరం గ్రామంలోని 51 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్ఎం మీనాకుమారి, డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస్ పెరుమాళ్ల, డీఎం సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం



పెరికెగూడెంలో ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జేవీఆర్

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టే రాజరాజేశ్వరి సమేత సాంబసదాశివ స్వామివారి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (జేవీఆర్) గురువారం పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పెరికెగూడెం గ్రామంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పాల్గొన్నారు. సర్పంచులు పెరుమాళ్ల పద్మ సత్యనారాయణ, బోనం శేషగిరి, ఎంపీటీసీలు చిన్ని కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మీకాంతం, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, బి గోకర్ణయాదవ్, బి రత్తయ్యనాయుడు, విష్ణువర్ధన్, ప్రదీప్, రాంబాబు, రాధాకృష్ణ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రతిభ పురస్కారం ప్రదానం



యూనివర్సిటీలో పురస్కారం అందుకుంటున్న కోనేరు గ్రీష్మ

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరానికి చెందిన విద్యార్థిని కోనేరు గ్రీష్మ జేఎన్‌టీయూ- కాకినాడ స్థాయిలో సత్తా చాటింది. మంచి మార్కులతో యూనివర్సిటీ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కంచికచర్లలోని దేవినేని వెంకట రమణ-డాక్టర్ హిమశేఖర్ మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీస్‌లో 2017-21 విద్యా సంవత్సరంలో కోనేరు గ్రీష్మ ఈసీఈ కోర్సు పూర్తి చేసింది. 2021 సంవత్సరానికి ఈసీఈ విభాగంలో 9.22 జీపీఏ సాధించింది. తద్వారా గ్రీష్మ జేఎన్‌టీయూ కాకినాడ స్థాయిలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. 2021 నాటి జేఎన్‌టీయూ స్నాతకోత్సవం కోవిడ్ కారణంగా నిర్వహించలేదు. 2017-21, 2018-22 బ్యాచ్‌ల స్నాతకోత్సవం ఇటీవల యూనివర్సిటీలో ఘనంగా జరిగింది. ఈ వేదికపై యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీవీఆర్ ప్రసాదరాజు కోనేరు గ్రీష్మకు ఓవరాల్ చాంపియన్ పురస్కారం, బంగారు పతకం ప్రదానం చేశారు. గ్రీష్మ ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం చేస్తోంది. గ్రీష్మకు ఓవరాల్ చాంపియన్ పురస్కారం, బంగారు పతకం లభించటం పట్ల ఆమె తల్లిదండ్రులు కోనేరు శ్రీనివాసరావు-శారద హర్షం వ్యక్తం చేశారు.